ట్రై సైకిళ్ల పంపిణీ ఆలస్యం

రెండు గంటలపాటు ఇబ్బంది పడిన దివ్యాంగులు

ట్రై సైకిళ్ల కోసం వేచి చూస్తున్న దివ్యాంగులు

కాశీబుగ్గ, జూలై 18: కార్యక్రమం ఆలస్యం కావడంతో దివ్యాంగులు ఇబ్బంది పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలోని పత్తియార్డులో గురువారం ఉదయం 10.30 గంటలకు దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీంతో వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాలకు చెందిన దివ్యాంగులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ముఖ్య అతిథిగా రావాల్సిన రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అనారోగ్య కారణాల వల్ల రాలేకపోయారు. దీంతో కలెక్టర్ సత్య శారద గంటకుపైగా వేచి ఉండి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుకు ఫోన్ చేసి కార్యక్రమానికి రావాలని గుర్తు చేశారు. అయితే, మంత్రి సురేఖ రాకపోవడంతో వాయిదా పడిందని ఆయన అనుకున్నట్లు తెలిసింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి కలెక్టర్ తీసుకెళ్లడంతో గంట తర్వాత వచ్చారు. వర్షాకాలం కావడంతో కాలకృత్యాలకు వెళ్లాల్సిన వారు, మహిళలు చాలా ఇబ్బంది పడ్డారు.

మక్కలు @ రూ. 2,780

ఎనుమాముల మార్కెట్‌లో క్వింటాల్‌కు రికార్డు ధర

కాశీబుగ్గ, జూలై18 : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో గురువారం మక్కలకు రికార్డు స్థాయిలో ధర పలికింది. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 2,090 ఉండగా బీఎల్‌టీ రకం (డైరెక్ట్) మక్కలకు రూ. 2,780 దక్కింది. ఈ సీజన్‌లోనే ఇది అత్యధికమని మార్కెట్ వర్గాలు తెలిపాయి. సీజన్ ప్రారంభమైన అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు 87,770 క్వింటాళ్ల మక్కలు మార్కెట్‌కు వచ్చాయి. గురువారం 354 క్వింటాళ్ల మక్కలు రాగా అత్యధికంగా రూ. 2,780, అత్యల్పంగా రూ. 2,580రే వ్యాపారులు కొనుగోలు చేశారు. ప్రస్తుతం మక్కలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో రానున్న రోజుల్లో మరింత ధర పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు తెలిపాయి.

ములుగు మెడికల్ కాలేజీకి వైద్య నిపుణులు

- మొత్తం 109 వైద్యాధికారుల పోస్టులు మంజూరు
- రెగ్యులర్, కాంట్రాక్టు పద్ధతిన నియామకం
- జిల్లాలో పెరుగనున్న వైద్య సేవలు

ములుగు జిల్లా మెడికల్ కళాశాల భవనం

ములుగు, జూలై18 (నమస్తేతెలంగాణ) : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం జిల్లాకు ఒకటి చొప్పున మెడికల్ కాలేజీని ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటవుతున్న మెడికల్ కాలేజీకి ప్రస్తుత ప్రభుత్వం 109 మంది వైద్యాధికారుల పోస్టులను మంజూరు చేసి, ఆర్థిక శాఖ ద్వారా ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ విభాగాల్లో 25 మంది ప్రొఫెసర్లు, 28 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 56 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ కానున్నాయి. ఈ పోస్టులను రెగ్యులర్‌తో పాటు కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేయనున్నారు. ఇప్పటికే ప్రిన్సిపాల్‌గా డాక్టర్ మోహన్‌లాల్ పనిచేస్తున్నారు. మరో రెండు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీల్లో దీర్ఘకాలంగా పనిచేస్తున్న వైద్య నిపుణులను బదిలీల ద్వారా ములుగు మెడికల్ కాలేజీకి ప్రభుత్వం కేటాయించనుంది. కొన్ని పోస్టులు బదిలీల ద్వారా భర్తీ కాగా, మిగిలిన వైద్యాధికారులను కాంట్రాక్టు పద్ధతిని నియమించనున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1.25లక్షలు, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1.50లక్షలు, ప్రొఫెసర్‌కు రూ.1.90లక్షల వేతనం ఇవ్వనున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో మెడికల్ కాలేజీ ప్రారంభించేందుకు అన్ని అనుమతులను పొందేలా కృషి చేస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌లాల్ తెలిపారు. ఏదైనా సాంకేతిక కారణాల వల్ల ఈ విద్యా సంవత్సరంలో అనుమతులు మంజూరు కాకపోతే వచ్చే విద్యా సంవత్సరంలో మాత్రం కచ్చితంగా మంజూరవుతాయని ప్రిన్సిపాల్ చెప్పారు.

ములుగులో పెరుగనున్న వైద్య సేవలు

మెడికల్ కాలేజీ ఏర్పాటుతోపాటు 109 మంది ప్రత్యేక వైద్య నిపుణుల నియామకం ద్వారా ములుగులో వైద్య సేవలు మెరుగు పడనున్నాయి. ఇప్పటికే ములుగు ప్రభుత్వ దవాఖానను జిల్లా స్థాయికి అప్‌గ్రేడ్ చేసి, డీఎంఈకి అప్పగించారు. గత ప్రభుత్వ హయంలోనే మార్కెట్ యార్డులో రూ.60కోట్లతో మూడు భవనాలను మెడికల్ కాలేజీ కోసం నిర్మించారు. అదేవిధంగా గట్టమ్మ దేవాలయ సమీపంలో 25 ఎకరాల భూమిని మెడికల్ కాలేజీ కోసం కేటాయించారు. కళాశాల తరగతి గదులు, హాస్టల్ కోసం మార్కెట్ యార్డులో భవనాలు సిద్ధమయ్యాయి. త్వరలో చేపట్టబోయే బదిలీల్లో ప్రత్యేక వైద్య నిపుణులు వచ్చి ములుగు మెడికల్ కాలేజీలో విధులు నిర్వహిస్తే ప్రజలకు వైద్య సేవలు మరింత మెరుగ్గా అందే అవకాశాలు ఉన్నాయి.

ఏటూరునాగారం ఐటీడీఏ వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

పేదల ఇంటికి హక్కు పత్రాలివ్వాలి

ఐటీడీఏ వద్ద గిరిజనుల ధర్నా

ఏటూరునాగారం, జూలై 18 : ములుగు జిల్లా వాజేడు మండలంలోని సర్వే నంబర్ 11లోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న వారికి హక్కు పత్రాలు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ ఏటూరునాగారం ఐటీడీఏ వద్ద గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మిడియం బాబురావు మాట్లాడుతూ నిరుపేదలు గుడిసెలు వేసుకుని ఎనిమిది నెలలు కావస్తున్నదని, వారికి వెంటనే హక్కు పత్రాలు ఇవ్వడంతోపాటు తాగునీటి వసతి కల్పించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత గుడిసెలు కూల్చే పని మొదలు పెట్టారంటూ ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ఇంటికి తక్షణమే ఐటీడీఏ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించి తాగునీటికి బోర్లు వేయాలని కోరారు. అనంతరం సమస్యలపై ఐటీడీఏ పీవో చిత్రామిశ్రాతో చర్చించారు. కార్యక్రమంలో సీసీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి, నాయకులు బీరెడ్డి సాంబశివరెడ్డి, దావూద్, రమాదేవి, చిరంజీవి, దామోదర్, కృష్ణబాబు, గుగ్లిళ్ల దేవయ్య, సౌమ్య, ముత్తయ్య, శాంతికుమారి, కుమారి, కృష్ణారావుతో పాటు సుమారు 300 మంది పాల్గొన్నారు.

ములుగు డీఎంహెచ్‌వోను అభినందించిన ఆరోగ్య శాఖ మంత్రి

ములుగు, జూలై 18(నమస్తే తెలంగాణ) : ములుగు డీఎంహెచ్‌వోను రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఎక్స్ వేదికగా అభినందించారు. మంగళవారం వాజేడు మండలంలోని పెనుగోలు గ్రామానికి కాలినడకన మూడు గుట్టలెక్కి.. మూడు వాగులు దాటి వెళ్లి వైద్య సేవలందించి బుధవారం తిరిగి వచ్చారు. ఈ నేపథ్యంలో అప్పయ్య సేవలు అమోఘమని మంత్రి మెచ్చుకున్నారు. సీజనల్ వ్యాధుల నిర్మూలనకు వైద్యాధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని, ములుగు డీఎంహెచ్‌వోను ఇతర జిల్లాల అధికారులు ఆదర్శంగా తీసుకొని గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులకు మెరుగైన వైద్య సేవలందించాలంటూ పోస్టు చేశారు.

కేఎంసీ ప్రిన్సిపాల్, ఎంజీఎం సూపరింటెండెంట్ బదిలీ

పలువురు ప్రొఫెసర్లకూ స్థానచలనం

వరంగల్ చౌరస్తా, జూలై 18 : కాకతీయ మెడికల్ కళాశాల (కేఎంసీ) ప్రిన్సిపాల్ డాక్టర్ దివ్వెల మోహన్‌దాస్‌తో పాటు ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ వలపదాసు చంద్రశేఖర్ బదిలీ అయ్యారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన సాధారణ బదిలీల్లో మోహన్‌దాస్‌ను నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, చంద్రశేఖర్‌ను ములుగు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రొఫెసర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. అలాగే నర్సంపేట జీఎంసీ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న బి కిషన్ బదిలీ అయ్యారు. వీరితో పాటు కేఎంసీలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ భిక్షపతిరావును ములుగు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రొఫెసర్‌గా, డాక్టర్ జీ చంద్రశేఖర్‌ను నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రొఫెసర్‌గా, డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ పవన్‌కుమార్‌లను భూపాలపల్లి ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రొఫెసర్లుగా బదిలీ చేశారు. వరంగల్ ఎంజీఎం ఫార్మసీ సూపర్‌వైజర్ పద్మావతిని ఖమ్మం ప్రభుత్వ హాస్పటల్‌కి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉద్యోగాల పేరుతో మోసం

- ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

కృష్ణకాలనీ, జూలై 18 : ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ కిరణ్‌ఖరే తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఎస్పీ నిందితుల వివరాలు వెల్లడించారు. కలెక్టర్ కార్యాలయం, జిల్లా పోలీస్ కార్యాలయాల్లో సెక్యూరిటీ గార్డ్స్, స్వీపర్ పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిలో పని చేసేందుకు కాంట్రాక్టు తనకు వస్తుందని నమ్మబలికి కరీంనగర్ టౌన్‌కు చెందిన గుర్రం శ్రీనివాసరావు, అతని కింద పని చేసే భూపాలపల్లి పట్టణానికి చెందిన సన్నాయిల సుభాష్, కాసంపల్లికి చెందిన మోకిడి అశోక్‌లు జిల్లాలోని నిరుద్యోగులు ఒక్కొక్కరి వద్ద రూ. లక్ష నుంచి రూ.2లక్షల వరకు మొత్తం రూ.50 లక్షల నుంచి రూ. 60 లక్షలు వసూలు చేశారు. కొన్ని రోజులు వారితో డ్యూటీలు చేయించి జీతాలు ఇవ్వకుండా తప్పించుకొని తిరుగుతున్నారు. అనుమానం రావడంతో శ్రీనివాసరావును నిలదీయగా కొంత మందికి డబ్బులు తిరిగి ఇచ్చాడు. మిగతా వారికి చెక్కులు ఇవ్వగా అకౌంట్‌లో డబ్బులు లేకపోడంతో శ్రీనివాసరావును నిలదీశారు. దీంతో అతని వద్ద పని చేసే కొందరు కలెక్టరేట్ పక్కన వారి వద్ద చెక్కులు లాక్కొని కొట్టడమే కాకుండా చంపుతామని బెదిరించారు. ఈ విషయమై గణపురం మండలం గాంధీనగర్‌కు చెందిన బాధితుడు దొంగల చందు భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌లో శ్రీనివాసరావు, అతని దగ్గర పనిచేసే సుభాష్, అశోక్‌పై ఫిర్యాదు చేశాడు. వారిపై కేసు నమోదు చేసి నిందితులను పట్టుకొని వారి వద్ద చెక్కు, కారును స్వాధీనం చేసుకొని గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వివరించారు. కేసు ఛేదించడంలో ప్రతిభ కనబర్చిన డీఎస్పీ సంపత్‌రావు, సీఐ నరేశ్‌కుమార్, భూపాలపల్లి, సీసీఎస్ ఎస్సైలు ప్రసాద్, సుధాకర్, రమేశ్, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ సదానందం, భూపాలపల్లి పీఎస్ కానిస్టేబుళ్లు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, రాంబాబును ఎస్పీ అభినందించారు.

పంట పొలాలకు వెళ్లేదెలా?

- కొట్టుకుపోయిన కల్వర్టు.. మరమ్మతుకు నోచుకోని కొత్తపల్లి మాటు

వరదలకు కొట్టుకుపోయిన దారి

జయశంకర్ భూపాలపల్లి, జూలై 18 (నమస్తే తెలంగాణ) : మోరంచ ఉగ్రరూపం తాలూకు గాయాలు ఇంకా మానలేదు. దారులు, బ్రిడ్జిలు, చెరువులు అస్తవ్యస్తమయ్యాయి. మరమ్మత్తులతో గాడిన పడుతున్నాయి. కాగా, గత జూలైలో మోరంచ వాగు ఉధృతికి కొత్తపల్లి (ఎస్ఎం) సమీపంలోని మాటు తెగిపోయి దారిలేకుండా పోయింది. కొత్తపల్లి చెరువు మత్తడి సమీపం నుంచి ఉన్న మాటు ద్వారా రైతులు పంట పొలాలకు వెళ్తుంటారు. అయితే గత ఏడాది వరదలతో తెగిన మాటుకు అధికారులు ఇప్పటి వరకు మరమ్మత్తులు చేపట్టలేదు. దారి లేక ఏడాదిగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలి నడకన మాత్రమే వెళ్లడం వీలవుతుందని, వ్యవసాయ పరికరాలు, ఎరువులు పొలాల వద్దకు తీసుకెళ్లడం కష్టంగా ఉందని రైతులు వాపోతున్నారు. అధిక శాతం భూములు ఈ మాటు అవతలి వైపే ఉన్నాయని, అధికారులు ఇప్పటికైనా స్పందించి కొత్తపల్లి మాటుకు మరమ్మత్తులు చేపట్టి దారిని పునరుద్ధరించాలని కోరుతున్నారు.



గురువారం బ్రిటిష్ హై కమిషన్, ఈ అండ్ వై ప్రతినిధులతో మంత్రి శ్రీధర్ బాబు

డిసెంబర్‌కల్లా మలబార్ ప్లాంట్ రెడీ

- మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): ప్రముఖ బంగారం, వజ్రాభరణాల తయారీ సంస్థ మలబార్ జ్యుయెల్లరీ తెలంగాణ ప్లాంట్.. ఈ ఏడాది చివరికల్లా ఉత్పత్తిలోకి రానున్నది. రూ.750 కోట్ల పెట్టుబడితో మహేశ్వరంలో ఈ నగల తయారీ కేంద్రాన్ని మలబార్ ఏర్పాటు చేస్తున్నది. గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో సంస్థ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో మహేశ్వరంలో ప్లాంట్ ఏర్పాటుకు కావాల్సిన భూమిని అప్పుడే కేటాయించారు. మొదటి దశలో ఇప్పటికే కంపెనీ రూ.183 కోట్ల పెట్టుబడులు పెట్టింది. ఈ క్రమంలోనే గురువారం మలబార్ వర్గాలు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో సచివాలయంలో సమావేశమయ్యారు. ప్లాంట్ నిర్మాణం తదితర వివరాలను తెలియజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మలబార్ సంస్థ మహేశ్వరంలో తెస్తున్న యూనిట్ దేశంలోనే అతిపెద్దదని చెప్పారు. డిసెంబర్‌కల్లా సిద్ధమవుతుందన్నారు. అలాగే కావాల్సిన మౌలిక సదుపాయాలను నెల రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఏఐపై 20 ఏండ్ల రోడ్‌మ్యాప్..

ప్రభుత్వ పాలన, పారిశ్రామిక రంగాల్లో కృత్రిమ మేధ(ఏఐ) వినియోగంపై వచ్చే 20 ఏండ్లకు అవసరమైన ఒక రోడ్‌మ్యాప్‌ను రూపొందించాలని మంత్రి శ్రీధర్ బాబు బ్రిటిష్ హై కమిషన్, ఏర్నెస్ట్ అండ్ యంగ్(ఈ అండ్ వై) కంపెనీ ప్రతినిధులకు సూచించారు. తెలంగాణా ప్రభుత్వం 200 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న ఏఐ సిటీలో బ్రిటిష్ హై కమిషన్, ఈ అండ్ వై సంస్థలు కీలక భాగస్వాములు కావాలని ఆయన కోరారు. మరోవైపు సెబీ రూపొందించిన సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ విధానం ద్వారా సంక్షేమ పథకాలకు అవసరమైన నిధులను సేకరించనున్నట్లు శ్రీధర్ బాబు వెల్లడించారు. నిధుల సమీకరణకు ప్రణాళికపై ఆయన గురువారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

ఐటీ ఉద్యోగులకు నిరాశే

జీతాల పెరుగుదల అంతంతే • టాప్ కంపెనీల్లో వృద్ధి శాతం సింగిల్ డిజిట్

సగటున జీతాల పెంపు %	TCS*	Infosys*	HCL*	Wipro**	TechM*
FY24	7-9	9	NA	9.4	5.6
FY23	6-9	9.9	5.1	13.4	6
FY22	10.5	14.6	6.8	10.4	5.2
FY21	6.4	6	4	10	0.3

బెంగళూరు, జూలై 18: సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు గత ఆర్థిక సంవత్సరం (2023-24) నిరాశనే మిగిల్చింది. అంతకుముందు రెండు ఆర్థిక సంవత్సరాలు సిబ్బంది జీతాలను రెండంకెల స్థాయి వృద్ధిలో పెంచిన ప్రధాన ఐటీ రంగ సంస్థలు.. గత ఆర్థిక సంవత్సరం మాత్రం సింగిల్ డిజిట్‌కే పరిమితం చేశాయి మరి. దేశంలోని టాప్-5 ఐటీ కంపెనీల్లో మూడింట్లో వ్యయ నియంత్రణ చర్యలు స్పష్టంగా కనిపిస్తుండటం గమనార్హం. ఆర్థికపరమైన సవాళ్లను ఎదుర్కొనేందుకు ఆయా సంస్థలకు ఖర్చుల కట్టడి తప్పట్లేదు. ఇందులో భాగంగానే ఉద్యోగులకు వార్షిక వేతనాల పెంపులో కోత పెడుతున్నాయి. దీంతో మెజారిటీ ఐటీ ఉద్యోగులకు ఈ ఏడాది మార్చి ఆఖరుతో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 5 శాతం నుంచి 9 శాతం మేరకే సాలరీల్లో ఇంక్రిమెంట్లు దక్కాయి.

దిగ్గజ సంస్థల్లో..

దేశీయ ఐటీ రంగ సంస్థల్లో రెండో అతిపెద్ద సంస్థ అయిన ఇన్ఫోసిస్‌లో గత ఆర్థిక సంవత్సరం ఉద్యోగుల జీతాలు సగటున 9 శాతమే పెరిగాయి. ఐటీ రంగ దిగ్గజం టీసీఎస్‌లోనైతే 7-9 శాతమే. విప్రో విషయానికొస్తే.. 2023-24లో 9.4 శాతంగా ఉంటే.. టెక్ మహీంద్రాలో 5.6 శాతమే. కాగా, కరోనా ప్రభావం ఉన్నప్పటికీ 2021-22లో టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో కంపెనీలు తమ ఉద్యోగుల జీతాలకు రెండంకెల స్థాయిలో పెంపు శాతాన్నిచ్చాయి. టెక్ మహీంద్రా 5.2 శాతం, హెచ్‌సీఎల్ 6.8 శాతంతోనే సరిపెట్టాయి.

ప్రతికూలతల వల్లే..

భారీ సంఖ్యలో ఉద్యోగులు, పెరుగుతున్న వ్యాపార ఖర్చులు.. భారతీయ ఐటీ రంగాన్ని దెబ్బతీస్తున్నట్టు రిక్రూట్‌మెంట్ కన్సల్టెన్సీ మిషెల్ పేజ్ ప్రతినిధి ప్రన్షు ఉపాధ్యాయ్ అన్నారు. సంస్థాగత ఆదాయం-లాభాలు తగ్గడంతో దానికి తగ్గట్టుగానే పొదుపు మంత్రం జపిస్తున్నాయన్నారు. ఇక ప్రవేశ స్థాయిలో ప్రతిభ, నైపుణ్యం కలిగిన ఉద్యోగుల లభ్యత లేకపోవడం కూడా సమస్యగా మారిందని చెప్పారు. కాగా, సంక్లిష్టమైన సాంకేతిక నైపుణ్యాలను కలిగిన ఉద్యోగులకు 12 నుంచి 15 శాతం సగటున సాలరీలు పెరుగుతున్నట్టు రాండ్‌స్టడ్ డిజిటల్ ఇండియా ఎండీ మిలింద్ షా తెలిపారు. ఆయా సంస్థలు డిజిటలైజేషన్ దిశగా అడుగులు వేస్తుండటంతో ప్రతిభావంతులకు సహజంగానే పెద్దపీట దక్కుతున్నదని తెలియజేశారు. వారి అవసరాలు బాగా ఉండటంతోనే జీతాలు అంతలా పెరుగుతున్నాయని గుర్తుచేస్తున్నారు. ఈ క్రమంలోనే వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) ఏఐ, ఎంఎల్, సైబర్‌సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, డాటా అనలిటిక్స్ విభాగాల్లో నిపుణులకు గిరాకీ ఎక్కువగా ఉంటుందని ఆయన అంచనా వేశారు.

మున్ముందూ తిప్పలే

దేశ, విదేశాల్లో నెలకొన్న ఆర్థిక మందగమనం ఛాయలు.. భారతీయ ఐటీ కంపెనీలకు మున్ముందు మరిన్ని ఇబ్బందులను సృష్టించగలవన్న అభిప్రాయాలు ఇప్పుడు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ముఖ్యంగా అమెరికా, యూరప్ దేశాల్లో ఆర్థిక సంక్షోభపు పరిస్థితులు.. దేశీయ ఐటీ కంపెనీల ఆదాయానికి ఇప్పటికే గండి కొడుతున్నాయని వారు గుర్తుచేస్తున్నారు. అందుకే భారీగా ఉద్యోగ కోతలు, అంతంతమాత్రంగా జీతాల పెంపులని ఐటీ రంగ నిపుణులు ప్రస్తుత సరళిని విశ్లేషిస్తున్నారు. అగ్ర దేశాల రక్షణాత్మక ధోరణులు, వివిధ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలు కూడా ఆర్థిక వ్యవస్థల్ని ప్రభావితం చేస్తున్నాయని పేర్కొంటున్నారు. ఈ పరిస్థితులు మారకపోతే ఐటీయేగాక అన్ని రంగాల మనుగడకు ముప్పేనని హెచ్చరిస్తుండటం గమనార్హం.

వాణిజ్య

రూపాయే..

ముంబై, జూలై 18: దేశీయ కరెన్సీ రికార్డు స్థాయికి పతనమైంది. ఫారెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి డాలర్-రుపీ ఎక్స్ఛేంజ్ రేటు 5 పైసలు కరిగిపోయి 83.63 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు పెరగడంతో డాలర్‌కు అనూహ్యంగా మద్దతు లభించింది. దీంతో ఇతర కరెన్సీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయని ఫారెక్స్ ట్రేడర్ వెల్లడించారు. 83.57 వద్ద ప్రారంభమైన డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ ఇంట్రాడేలో 83.55 గరిష్ఠ స్థాయిని తాకింది. ఒక దశలో 83.66 చారిత్రక కనిష్ఠ స్థాయిని తాకిన విలువ చివరకు నిన్నటి ముగింపుతో పోలిస్తే ఐదు పైసలు తరిగిపోయి 83.57 వద్ద స్థిరపడింది.

అరబిందో 750 కోట్ల బైబ్యాక్!

హైదరాబాద్, జూలై 18: ప్రముఖ ఫార్మా సంస్థ అరబిందో ఫార్మారూ.750 కోట్ల విలువైన షేర్లను తిరిగి కొనుగోలు చేయబోతున్నది. ఇందుకుగాను కంపెనీ బోర్డు సమావేశమై గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. షేరుకు రూ.1,460 చొప్పున 51,36,986 షేర్లను బైబ్యాక్ చేయనుండటంతో 0.88 శాతం వాటా పెరగనున్నది. ప్రస్తుతం సంస్థలో ప్రమోటర్లకు 51.8 శాతం వాటా ఉండగా, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు 16.73 శాతం, మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్టర్లకు 19.17 శాతం వాటా ఉన్నది.

81 వేల పైకి సెన్సెక్స్

మరో మైలురాయిని అధిగమించిన సూచీ

ముంబై, జూలై 18: దేశీయ స్టాక్ మార్కెట్లు మరో మైలురాయిని అధిగమించాయి. రికార్డుల మీద రికార్డులు బద్దలు కొడుతున్న సూచీలు గురువారం మరో ఉన్నత శిఖరానికి చేరుకున్నాయి. ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్, ఎఫ్ఎంసీజీ రంగ షేర్ల నుంచి లభించిన మద్దతుతో 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ తొలిసారిగా 81 వేల మైలురాయిని అధిగమించింది. దేశీయ ఈక్విటీ మార్కెట్ చరిత్రలో ఈ రికార్డును అధిగమించడం ఇదే తొలిసారి కావడం విశేషం. మార్కెట్ ముగిసే సమయానికి సూచీ 626.91 పాయింట్లు అందుకొని 81,343.46 పాయింట్ల వద్ద స్థిరమైంది. బలహీనంగా ప్రారంభమైన సూచీలకు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలతో రివ్వున ఎగిశాయి. ఐటీ రంగ సంస్థలు అంచనాలకుమించి రాణిస్తుండటంతో మదుపరులు ఈ షేర్లను కొనుగోలు చేయడానికి ఎగబడటంతో ఇంట్రాడేలో 800 పాయింట్లకు పైగా ఎగబాకింది. చివర్లో ఈ భారీ లాభాలను నిలుపుకోలేకపోయింది. మరో సూచీ నిఫ్టీ ఒక దశలో 220 పాయింట్లకు పైగా బలపడ్డ సూచీ చివర్లో 187.85 పాయింట్లు అందుకొని 24,800.85 వద్ద స్థిరపడింది.

- టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ 3.33 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. ఇన్ఫోసిస్ 1.93 శాతంతోపాటు బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా, టెక్ మహీంద్రా, హెచ్‌యూఎల్, హెచ్‌సీఎల్, ఎస్బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- కానీ, యెస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కెనరా బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎన్‌టీపీసీ, అదానీ పోర్ట్స్ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- రంగాలవారీగా చూస్తే ఐటీ, టెలికం, ఆటో, టెక్ రంగ షేర్లు లాభపడగా..క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రీయల్స్, యుటిలిటీ రంగ షేర్లు నష్టపోయాయి.
- గత నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 1,446 పాయింట్లు(1.79 శాతం), నిఫ్టీ 485 పాయింట్లు(1.98 శాతం) బలపడ్డాయి.
- అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ ధర స్వల్పంగా తగ్గడం కూడా సూచీలు పుంజుకోవడానికి పరోక్షంగా కారణమయ్యాయి.

ఐటీ రంగ షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుతో సూచీలు రికార్డు స్థాయిలో దూసుకుపోయాయి. జూన్ త్రైమాసికపు ఆర్థిక ఫలితాల్లో ఐటీ సంస్థలు అంచనాలకుమించి రాణించడం, మరోవైపు రూపాయి బలహీనపడినప్పటికీ పుంజుకోవడం విశేషం. సెప్టెంబర్ సమీక్షలోనే అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటంతో ఎఫ్ఐఐలు దేశీయ ఈక్విటీ మార్కెట్లోకి నిధులు కుమ్మరించారు.

- వినోద్ నాయర్, జియోజిట్ ఫైనాన్షియల్ హెడ్

500 కోట్లతో తోషిబా ప్లాంట్ విస్తరణ

న్యూఢిల్లీ, జూలై 18: జపాన్‌కు చెందిన ఎలక్ట్రిక్ పరికరాల తయారీ సంస్థ తోషిబా గ్రూపు..భారత్‌లోవున్న ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచుకోనున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం 10 బిలియన్ జపాన్ యెన్(రూ.500 కోట్లకు పైమాటే)తో తెలంగాణలోని హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న ప్లాంట్ సామర్థ్యాన్ని రెండింతలు పెంచుకోనున్నట్లు కంపెనీ వైస్‌ప్రసిడెంట్, ఎండీ హిరోషి ఫురుటా ఈ సందర్భంగా తెలిపారు. 2023-24 నుంచి 2025-26 మధ్యకా